క్లుప్తంగా

కొనసాగుతున్న సురక్ష సర్వే



తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన ఇంటింటి సర్వే తెనాలిలో విస్తృతంగా జరుగుతుంది. గురువారం ఉదయం ముత్తంశెట్టిపాలెం, బాలాజీరావుపేట, డాక్టర్ రావి రవీంద్రనాథ్‌నగర్, చినరావూరు, చెంచుపేట పరిధిలోని ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి టెస్టులను చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. వచ్చే నెల ఐదోవ తేదీ నుంచి నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాలకు వారిని తీసుకువెళ్లి పరీక్షలు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరునికి విశేష పూజలు



తెనాలిఅర్బన్: నాజర్‌పేట సంకావారి కోట్ల బజార్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో బుధవారం రాత్రి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. స్వామివారికి పూజలు చేశారు. అనంతరం నిమజ్జనం ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వామినాథన్ మృతి రైతాంగానికి తీరనిలోటు

రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: ఆహార వృద్ధిలో భారతదేశం స్వయం సమృద్ధి సాధించేందుకు కృషిచేసిన ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ మృతి రైతాంగానికి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హరిత విప్లవ పితామహుడిగా మేలైన వరి వంగడాలను సృష్టించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రామన్ మెగసెసే, పద్మశ్రీ, పద్మవిభూషణ్ వంటి అవార్డులను ఆయన పొందారని గుర్తుచేసుకున్నారు. రైతుబాంధవుడిగా రైతాంగం గుండెల్లో ఆయన చిరస్మయణీంగా ఉంటారని, స్వామినాథన్ కమిషన్ చేసిన సూచనలను రైతాంగం అమలుచేయటమే ఆయనకిచ్చే నిజమైన నివాళిగా పేర్కొన్నారు.

వినాయకుడికి శాంతికల్యాణం



మంగళగిరి: నగరంలోని గణపతినగర్‌లో కల వినాయకుని ఆలయంలో గురువారం స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, కల్యాణం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ప్రారంభించారు.

దొంగకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

గుంటూరు రూరల్: దొంగకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఏటుకూరు గ్రామానికి చెందిన ఆళ్ళ మోహనరావు ఇంట్లో అద్దెకు నివసించే వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటిబయట పార్కుచేసి ఇంట్లోకి వెళ్ళాడు. అదే అదనుగా భావించిన దొంగ బైక్‌ను దొంగిలించేందుకు ప్రయత్నించగా స్థానికులు గుర్తించి అతనిని పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

పెదనందిపాడు: గ్రామాల్లో ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూసి వారికి మెరుగైన విద్యుత్ సేవలు అందించటమే విద్యుత్ శాఖ సిబ్బంది లక్ష్యమని ఆ శాఖ ఏఈ ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలో పలు గ్రామాల్లో జరుగుతున్న మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, గాలుల ధాటికి చాలా చోట్ల చెట్లు గాలి తీవ్రతకు విద్యుత్ తీగలపై పడటం వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. గురువారం మధ్యాహ్నం కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో స్థానిక లైన్‌మెన్ బాలునాయక్ లైను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటారని ఆయన తెలియజేశారు.

విశ్వనరుడు గుర్రం జాషువా ఆదర్శప్రాయుడు

- జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా
- ఘనంగా కవికోకిల గుర్రం జాషువా 128వ జయంతి సభ



జాషువా చిత్రపటం వద్ద జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే శివకుమార్, ఇతర అతిథుల నివాళి

తెనాలి: కులమతాల పంజరాన కట్టుబడను...విశ్వనరుడ నేను అన్న మహాకవి గుర్రం జాషువా ఆదర్శప్రాయుడని ఉమ్మడి గుంటూరు జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా అన్నారు. పట్టణానికి చెందిన గుర్రం జాషువా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో గురువారం నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్జీఓ కల్యాణమండపంలో ఏర్పాటైన సభకు సమితి కార్యదర్శి పినపాటి రవికుమార్ అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథిగా హాజరైన హెని క్రిస్టినా జాషువా ఆశయాలు సాకారం కావాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. మరో అతిథి, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, జాషువా సాహిత్యాన్ని డిజిటలైజ్ చేయాలని, అందుకు సమితి పూనుకోవాలని సూచించారు. అప్పుడే నేటి తరానికి చేరువ కాగలదని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఎంఈఓల సంఘం అధ్యక్షుడు ఆదూరి వెంకటరత్నం మాట్లాడుతూ మౌఢ్యానికి తావులేని విద్య కోసం రాష్ట్రప్రభుత్వం రూ.60 వేల కోట్లకు పైగా ఖర్చు చేయటం గొప్ప విషయమన్నారు. జాషువా పద్యాలను ఆలపించి సభికులను రంజింపజేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య పొన్నెకంటి జోసఫ్ రత్నాకర్ తన ప్రసంగంలో, కవితా వస్తువులో జాషువా ట్రెండ్‌సెట్టర్‌గా సోదాహరణంగా చెప్పారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, కర్నూలు ఉన్నం యెహెజ్కేలు మాట్లాడుతూ, నాటి కవుల తరహాలో రాజును కీర్తించకుండా, స్త్రీని వర్ణించకుండా సమాజహితం కోసమే జాషువా సాహిత్య రచన చేశారని చెప్పారు. పల్నాడు జిల్లా డీపీఎం కె.అమలకుమారి మాట్లాడుతూ జాషువా రచించిన క్రీస్తు చరిత ప్రాధాన్యతను వివరించారు. సీనియర్ అసిస్టెంట్ ప్రాసిక్యూటర్ సుద్దపల్లి సుకుమార్ మాట్లాడుతూ రాష్ట్రమంతా వేడుకలు జరుపుకొంటున్న కవి జాషువా ఒక్కరేనని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి మాట్లాడుతూ వ్యత్యాసం లేని సమాజాన్ని జాషువా కోరుకున్నారని చెబుతూ అలాంటి సమాజం ఏర్పడినపుడే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. జెల్లి గంటయ్య జ్యోతిప్రజ్వలన చేసిన సభలో కనపర్తి బాబూరావు మాట్లాడారు. వేజండ్ల రత్నం, కొండముది రమేష్‌బాబు, ఇందుపల్లి రాజారామ్, సుద్దపల్లి మురళీధర్, తెనాలి రాజగోపాలరావు పర్యవేక్షించారు. సాయంత్రం నాలుగు గంటల్నుంచి సుద్దపల్లి శరత్‌వెంకయ్య, చిట్టూరి సీతారామయ్య ఆధ్వర్యంలో జాషువా పద్యగానాన్ని నిర్వహించారు.

గుర్రం జాషువా రచనలు స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: మహాకవి గుర్రం జాషువా రచనలు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు ఎస్సీ కాలనీలోని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ రీడింగ్ రూమ్ ఆవరణలో గురువారం జాషువా జయంతిని జరిపారు. ఈ సందర్భంగా మహాకవి జాషువా, మధురకవి నూతక్కి అబ్రహాం చిత్రపటాలకు ఎమ్మెల్యే శివకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాషువా విజ్ఞాన సమితి అధ్యక్షుడు జె.న్యూటన్ మాట్లాడుతూ జాషువా రచనలు సమాజానికి ఎంతో మేలు చేశాయన్నారు. గత 20 ఏళ్లుగా జాషువా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చెక్కా సీతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పినపాటి అనిల్, కొమ్ము రాయల్, నల్లూరి సుమతి, ప్రసాదం రాధారావు, మల్లవరపు బాబి, ఉన్నం గోవర్ధన్, కార్తికేయ, నూతక్కి ఆచారి, ఉన్నం భూషణం, అత్తోట చంటి, దుబాయ్ బాబు, సుద్దపల్లి మురళీధర్, మోదుకూరు గురుదేవ్, తాడిబోయిన రమేష్, అక్కిదాసు కిరణ్, అడుసుమల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

- గంగానమ్మపేటలోని జైభీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో గుర్రం జాషువా జయంతి జరిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జై భీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కఠెవరపు దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బేతాళ భూషణం, సభ్యులు పాల్గొన్నారు.

తన రచనలతో వివక్షను ఎండగట్టిన జాషువా

తెనాలిటౌన్: నవయుగ కవిచక్రవర్తి, మహాకవి గుర్రం జాషువా జయంతిని గురువారం జాషువా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో ఉన్న జాషువా విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ తన రచనల ద్వారా సమాజంలోని కుల వివక్షను గుర్రం జాషువా ఎండగట్టారన్నారు. ఆయన రచనలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో విజ్ఞాన సమితి ప్రెసిడెంట్ జె.న్యూటన్, సెక్రటరీ పినపాటి రవికుమార్, ఎస్.ఎస్.సుకుమార్, ఇందుపల్లి రాజారామ్, కొండముది రమేష్, రాజగోపాల్, అయినాల మల్లేశ్వరరావు, నలుకుర్తి సద్గుణరావు, శ్యామ్ బాబు, కనపర్తి బెనహార్, గరికపాటి సుబ్బారావు, ఆళ్ళ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



కొలకలూరులో జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, నాయకులు



బస్టాండ్ వద్ద జాషువా విగ్రహానికి పూలమాలలు వేసిన విజ్ఞాన సమితి నాయకులు

రేపు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

కొల్లిపర: కొల్లిపర-3 విలేజ్ హెల్త్ సెంటర్ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శనివారం ఉదయం 9గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ వి.విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష డోర్ హెల్త్ సర్వేలో ముందుగానే గుర్తించిన రోగులు మాత్రమే వైద్య శిబిరానికి వచ్చి వివిధ 7రకాల వైద్య పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు తీసుకోవాలన్నారు. ఆరిమండవారి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని, విజయవంతం చేయాలని కోరారు.

స్వామినాథన్ కృషితోనే ఆహారభద్రత

తెనాలి: దేశంలో పెరుగుతున్న జనాభాకు కావాల్సిన ఆహారధాన్యాలను ముందుగానే అంచనా వేసి, ప్రభుత్వాల సహకారంతో తగిన ప్రణాళికలతో సాధించిన హరిత విప్లవకారుడు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విచారం వ్యక్తంచేశారు. దేశంలో ఆహార భద్రత ఆ మహనీయుడి కృషివల్లనే సాధ్యమైందని గురువారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు, ఈ రంగంపై ఆధారపడిన ఎందరో బడుగు, బలహీనవర్గాల ప్రజల జీవనప్రమాణాలు పెరుగుదలకు స్వామినాథన్ సిఫార్సులను అమలుచేసి ప్రభుత్వాలు తోడ్పడాలని సూచించారు. అప్పుడే స్వామినాధన్‌కు నిజమైన నివాళి అర్పించినట్టు కాగలదని స్పష్టంచేశారు.

'మన భూమి-మన దేశం' ర్యాలీ



పట్టణంలో విద్యార్థుల ర్యాలీ

తెనాలి: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల ఇచ్చిన పిలుపు 'మేరా మిట్టి-మేరా దేశ్' ప్రకారం స్థానిక అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా 50 మంది విద్యార్థులు వస్త్రధారణ చేశారు. వీరిలో కొందరు కోయబృందాలుగా, మరికొందరు శాంతికి చిహ్నమైన తెల్లని వస్త్రాలను ధరించారు. అంతా కలిసి మట్టి కలశాలను చేతబూని ప్రదర్శనలో పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు తీన్‌మార్, డ్రమ్ముల మోతలతో నినాదాలు మారుమోగించారు. తొలుత ప్రధానోపాధ్యాయుడు రాజకిషోర్ నేతృత్వంలో విద్యాకమిటీ చైర్మన్ రాజు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. చిత్రకళ ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ పర్యవేక్షించారు. మన భూమి-మన దేశం రెండు కళ్లుగా ఆయన చెప్పారు. భూమి లేకపోతే మనిషి మనుగడే లేదన్నారు. భారతదేశంలో జన్మించిన మనమంతా భారతీయులుగా ఐకమత్యంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, నీటి పొదుపును పాటించాలని, ఇందుకు ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. మట్టి కలశాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావుకు అందజేస్తామని చెప్పారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నాబార్డు డీడీఎం శరత్‌బాబు



మాట్లాడుతున్న నాబార్డ్ డీడీఎం శరత్‌బాబు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని సెయింట్ పాల్స్ ఆడిటోరియంలో గురువారం రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాబార్డ్ డీడీఎం శరత్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకులో తమ పొదుపును దాచుకోవాలని చెప్పారు. అధిక వడ్డీలకు ఆశపడి ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు, గొలుసు కట్టు కంపెనీలు మాయలో పడవద్దని తెలిపారు. బ్యాంకులో నగదు తీసుకుంటే సులభ వాయిదాలలో చెల్లించవచ్చని ఎక్కువ వడ్డీలకు ఆశపడి ఆర్థికంగా నష్టపోవద్దని చెప్పారు. ఎక్కువ వడ్డీలకు ప్రైవేట్ సంస్థల్లో నగదు తీసుకోవద్దన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, రఘురామయ్య, అవార్డు సంస్థ సెక్రటరీ రమణయ్య, సర్పంచ్ డి.మెల్కియా, రైతులు పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం



నెహ్రూనగర్: అన్నదానం పుణ్యకారంతో సమానమని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. శ్రీనివాసరావుపేట, సంగడిగుంట రెడ్ల బజార్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకల్లో భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, సంకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

మంగళగిరి: భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గురువారం గాలిగోపురం వద్ద కల భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పించి నాయకులు మాట్లాడుతూ బ్రిటీష్ పాలనను వ్యతిరేకిస్తూ విప్లవాత్మక ఉద్యమాలను చేపట్టిన భారత స్వాతంత్య్ర సమరయోధుడు, ఉద్యమకారుడు భగత్‌సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు జాలాది నవీన్‌బాబు, ఆళ్లమూడి హనోక్‌బాబు, దాసరి అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ: భారత స్వాతంత్య్ర ఉద్యమంలో తన విప్లవ చైతన్యంతో ఆంగ్లేయుల గుండెల్లో భయాన్ని రగిలించిన యువ విప్లవ కెరటం మహనీయుడు భగత్‌సింగ్ అని స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులు కొనియాడారు. భగత్‌సింగ్ 116వ జయంతిని పురస్కరించుకొని తాడికొండలో నిర్వహించిన వేడుకలలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ 14 ఏళ్లకే స్వాతంత్య్ర సంగ్రామంలో పాల్గొని 23 ఏళ్ళకే బలిదానం అయిన ఆయన తెగువ ధైర్యానికి ప్రతీక, దేశభక్తికి ప్రతిరూపం అన్నారు. అలాంటి అమరవీరుడిని స్మరించుకోవడం భావితరాలకు స్ఫూర్తిదాయకం అన్నారు. కార్యక్రమంలో ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్ గిల్డ్ సభ్యులు కె గోపాలరావు, జె సుబ్బారెడ్డి, డి రమేష్, టి మల్లేశ్వరరావు, ఎ శివశేషు, కె రామారావు, నాగేశ్వరరావు, నారాయణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ చికిత్సకు రూ. 6 లక్షలు ఆర్థిక సాయం

గుంటూరు మెడికల్: క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు గురువారం రూ. 6 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. నగరంలోని ప్రగతీనగర్‌లో నివసిస్తున్న రహంతుల్లా అద్దె ఇంట్లో ఉంటూ ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. అతడికి ఐదు నెలల కిందట క్యాన్సర్ సోకింది. చికిత్సకు ఆర్థిక సాయం అందించాలంటూ రహంతుల్లా కుమార్తె కోవిడ్ ఫైటర్స్ సభ్యుల్ని సంప్రదించింది. దీంతో వారు దాతల సహాయంతో విరాళాలు సేకరించి రూ. 6 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. దాతలకు రహంతుల్లా కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

రూ. 50వేలు అందించిన మైనార్టీ సెల్ చైర్మన్

క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆటోడ్రైవర్ రహంతుల్లాకు వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ చైర్మన్ ఖాదర్‌బాషా రూ. 50వేలు ఆర్థిక సాయం అందజేశారు. విరాళాలు సేకరించేందుకు ఆయన్ను కలవడంతో స్పందించి మొట్టమొదటిగా రూ. 50వేలు అందించారని కోవిడ్ ఫైటర్స్ సభ్యులు చెప్పారు.

సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ సదస్సు

గుంటూరు రూరల్: సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.రాజకుమారి తెలిపారు. గురువారం నగరంలోని కృషి భవన్‌లో గుంటూరు, పల్నాడు జిల్లాల రైతులు, శాస్త్రవేత్తలకు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. తిమ్మాటిక్ లీడ్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ మెంటర్స్, ఫార్మర్ సైంటిస్టులందరు తమ యొక్క పొలాల్లో ప్రయోగాలు చేసి డేటా తీసుకోవాలన్నారు. దీనివల్ల పూర్తి స్థాయిలో ప్రయోగాలు చేయవచ్చన్నారు. డేటాను ఏ విధంగా సేకరించాలో తెలిపారు. పీఆర్‌సీ వెంకటరావు మాట్లాడుతూ ఏడాది పొడవునా నేలను కప్పి ఉంచడం ద్వారా భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుందన్నారు. అన్ని పంటలలో దేశీ రకాల విత్తనాలు వాడాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన భూమిలో మైక్రోబ్స్ పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో రమ్య, టీపీపీ ఇర్ఫాన్, డీపీపీలు సుస్మిత, భవాని తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాటం యువతరానికి స్ఫూర్తి

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు



భగత్‌సింగ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న దృశ్యం



భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తెనాలి: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ ఆదేశాలపై కౌన్సిల్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు ఆధ్వర్యంలో గురువారం ఇక్కడి భగత్‌సింగ్ 116వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాజీచౌక్‌లోని భగత్‌సింగ్ విగ్రహానికి పుష్పాంజలి సమర్పించారు. పేదలకు అన్నం పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ,1857 సిపాయిల తిరుగుబాటు స్ఫూర్తితో భగత్‌సింగ్ భారత దేశం స్వాతంత్ర్యం కోసం పోరాటానికి దిగారని చెప్పారు. చిన్న వయసులోనే బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీపై యుద్ధానికి కాలుదువ్వి అమరుడయ్యారని చెప్పారు. ఈ దేశం స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం చంద్రశేఖర ఆజాద్, భగత్‌సింగ్, రాజగురు, అల్లూరి సీతారామరాజు వంటి వీరులు త్యాగాలను చేశారని వివరిస్తూ, నేటి యువతరం వీరి భావాలను, పోరాటస్ఫూర్తిని అలవరచుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి తుంగ బాలస్వామి మాట్లాడుతూ భగత్‌సింగ్ జీవిత విశేషాలను తెలియజేశారు. ఉపాధ్యక్షుడు కంచర్ల రాజేష్, సభ్యులు చాటగడ్డ ప్రసాద్, సయ్యద్ సుభాని, సీహెచ్ సాయి, సుభాని పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పనిచేయాలి..

తెనాలిఅర్బన్: సర్దార్ భగత్‌సింగ్ చిన్నవయస్సులోనే దేశ స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషించి తన ప్రాణాలను సైతం త్యాగం చేశారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ పేర్కొన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శివాజీ చౌక్‌లోని ఆయన విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత భగత్‌సింగ్ ఆశయసాధన కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గుండు శివ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దినేని కిరణ్‌బాబు, నాయకులు తాండూరు భూమేష్, యశ్వంత్, వినయ్, సాయి, కుంభ రవితేజ, బిల్లా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు రంగు మాత్రమే మారింది..కలుషితం కాలేదు

నగర కమిషనర్ యు శారదాదేవి



మంగళగిరి: పట్టణంలో సరఫరా అవుతున్న తాగునీరు రంగు మారిందే కాని ఎలాంటి కలుషితం కాలేదని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నగర కమిషనర్ యు శారదాదేవి పేర్కొన్నారు. తాగునీరు కలుషితం కావడంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని వస్తున్న వార్తల నేపథ్యంలో గురువారం కమిషనర్ మాట్లాడుతూ కొద్ది రోజులుగా మున్సిపల్ నుంచి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితం కావడంతో ప్రజలు అనారోగ్యాలపాలవుతున్నారని విమర్శలు వెల్లువెత్తాయని, స్పందించిన అధికారులు నీటి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపారని తెలిపారు. ల్యాబ్ నివేదికలలో తాగునీరు కలుషితం కాలేదని తేలిందని చెప్పారు. కలుషిత తాగునీరు సరఫరా చేస్తున్నారనే అపోహలను ప్రజలు నమ్మకుండా వినియోగించుకోవచ్చన్నారు. వాతావరణ మార్పులు, సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలు వచ్చే అవకాముందన్నారు. సీజనల్ వ్యాధులు వైరల్ జ్వరాలు వచ్చిన వెంటనే దగ్గరలో ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో చికిత్స తీసుకుని తగిన మందులు వాడాలన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రభుత్వాసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ప్రజలందరూ తప్పనిసరిగా నీటిని కాచి చల్లార్చి తాగడంతోపాటు నీటిపాత్రలపై ఎప్పుడూ మూతవేసి ఉంచాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డ్రైనేజీలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా చూడాలన్నారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా ఎల్లప్పుడూ మూతలు పెట్టి ఉంచాలన్నారు. అపరిశుభ్ర పరిసర ప్రాంతాలతోపాటు రోడ్లపై విక్రయించే తినుబండారాలు, ఆహారపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. నీటి సరఫరా, సీజనల్ వ్యాధులకు సంబంధించి ఎటువంటి సమస్య తలెత్తినా కాల్ సెంటర్ 7093912653 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కాల్ వచ్చిన వెంటనే నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

స్విమ్మింగ్ ఫూల్, స్కేటింగ్ ట్రాక్‌లను అందంగా తీర్చిదిద్దాలి

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)
- తుది దశ పనుల పరిశీలన



పౌంటెయిన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి: నగరంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రీడాప్రాంగణం(ఆత్మకూరు తాగునీటి పథకం) ఆవరణలో పూర్తి చేసుకున్న స్విమ్మింగ్ ఫూల్, స్కేటింగ్ ట్రాక్ పనులు పూర్తయిన నేపథ్యంలో మరింత ఆకర్షణీయంగాను, అందంగాను తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులకు సూచించారు. గురువారం నగరంలో వైఎస్సార్ మెమోరియల్ క్రీడాప్రాంగణంలో స్విమ్మింగ్ ఫూల్, స్కేటింగ్ ట్రాక్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కార్పొరేషన్ సంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి సత్వరమే పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యతలో రాజీపడకుండా వేగవంతంగా పనులు చేయాలన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజిలతో తాగునీటి పథకం పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. నగరాన్ని పచ్చదనంతో కూడిన సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ యు శారదాదేవి, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ మహ్మద్ ఫిరోజ్, దుగ్గిరాల మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ షేక్ బాజి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తాం

ఎంటీవీకే ట్రస్ట్ చైర్మన్ పి.మధు

తాడేపల్లిరూరల్: మహిళల అభివృద్ధి కోసం ఎంటీవీకే ట్రస్ట్ పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని ట్రస్ట్ చైర్మన్ పి.మధు అన్నారు. గురువారం తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో జరుగుతున్న కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కుట్టు శిక్షణలో ఉన్న మహిళలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలంతా పట్టుదలగా కుట్టు శిక్షణ నేర్చుకోవాలన్నారు. శిక్షణ నేర్చుకుని కుటుంబంలో ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు చేదోడు వాదోడుగా ఉండాలని కోరారు. విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పి. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం మొదటి బ్యాచ్‌లో కొంతమందికి శిక్షణ ఇస్తున్నామని, ఈ బ్యాచ్ ముగియగానే రెండో బ్యాచ్‌కు శిక్షణ మొదలు పెడతామని అన్నారు. కార్యక్రమంలో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారావు, ట్రైనర్ ఎస్‌కె నాగుర్ బీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరాలు

గుంటూరు మెడికల్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా లలితా హాస్పిటల్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లలితా గ్రూఫ్ ఆఫ్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ తెలిపారు. గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 500 మంది వినియోగించుకున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రజలందరికీ గుండె జబ్బుల గురించి అవగాహన కల్పించడానికి వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29ని వరల్డ్ హార్ట్‌డే గా ప్రకటించిందని మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ పి.వి.రాఘవశర్మ తెలిపారు.

మోహనార్జున హాస్పిటల్‌లో...

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.జి.మోహనార్జున్ తెలిపారు. స్థానిక కొత్తపేటలోని మోహనార్జున హాస్పిటల్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

